**బెంగుళూరులో విధాన సభ భవన నిర్మాణ రూపకల్పన గావించిన వై. విశ్వేశ్వరయ్య భారతీయ ఇంజనీరుగా ప్రపంచ ప్రఖ్యాతి గాంచాడు.**

# అపారమైన అశాంతి

ఒకసారి విశ్వేశ్వరయ్య షికాగో మహానగరంలో ఏదో నిర్మాణ పథకానికి రూపకల్పన చేస్తున్నారు. ఆ సందర్భంగా ఆయనకు ఒక విషయంపై విస్తృతమైన వ్యాసం అవసరం పడింది. దానికోసం ఆయన ఒక రచయితని సంప్రదించి, వ్యాసం రాసి పెట్టమని కోరగా అందుకు రచయిత సరేనని అంగీకరించాడు. తనకోసం రాయబోయే వ్యాసానికి ఎనిమిది డాలర్లు పారితోషికంగా ఇవ్వటానికి విశ్వేశ్వరయ్య ఆ రచయితతో ఒక ఒప్పందం కుదుర్చుకున్నారు.

అనుకున్న సమయానికి ఆ రచయిత తన సెక్రటరీ ద్వారా విశ్వేశ్వరయ్యకి వ్యాసం రాసి పంపించాడు. ఆ వ్యాసం విశ్వేశ్వరయ్యకి చాలా బాగా నచ్చింది.

ఇంత చక్కని వ్యాసం రాసిన ఆ రచయితకి విశ్వేశ్వరయ్య మెచ్చుకోలుగా అనుకున్నదాని కంటె కాస్త ఎక్కువ పారితోషికం ఇవ్వాలనుకున్నాడు. అందుకే విశ్వేశ్వరయ్య ఆ రచయితకి ఆయన సెక్రటరీ ద్వారా ఎనిమిది డాలర్లకి బదులుగా తొమ్మిది డాలర్లు పారితోషికం పంపించారు.

ఈ పారితోషికం అందుకున్న ఆ రచయిత వెంటనే విశ్వేశ్వరయ్యని వెదుక్కుంటూ ఆయన హోటల్‌కి వచ్చాడు.

"మనం అనుకున్నదాని కంటె ఒక డాలరు మీరు ఎక్కువ పారితోషికం ఇచ్చారు. అది తిరిగి ఇచ్చేద్దామనే నేను ఇక్కడికి వచ్చాను" అని ఆ రచయిత విశ్వేశ్వరయ్యకు ఆ ఒక్క డాలరు తిరిగి ఇచ్చేశాడు.

అప్పుడు విశ్వేశ్వరయ్య మందహాసంతో, "మీ వ్యాసం నాకు బాగా నచ్చింది. అందుకే నేను మీకు ఒక డాలరు అధిక పారితోషికం పంపించాను. ఇది నా తరఫు నుండి ఒక బహుమతిగా స్వీకరించండి" అని ఆ రచయితని కోరాడు.

అందుకు ఆ రచయిత అంగీకరించలేదు.

"క్షమించండి. ఈ బహుమతిని నేను స్వీకరించలేను. నా వ్యాసం మీకు నచ్చినందుకు చాలా కృతజ్ఞతలు. మీరు నోటితో చెప్పిన ఈ మాటలే ఈ అదనపు డాలరు కంటె ఎంతో అమూల్యమైనవి. మీ ప్రశంసలే నాకు నిజమైన గిఫ్ట్. దానిని తప్పకుండా స్వీకరిస్తాను. కానీ ఈ డాలరు గిఫ్టును మాత్రం స్వీకరించలేను" అన్నాడు ఆ రచయిత.

ఆ రచయిత మృదుమధురమైన మాటలు, నిర్మొహమాటంగానే అయినా మనసుకి కష్టం కలిగించకుండా ఆ అదనపు డాలరు తిరిగి ఇచ్చేస్తున్న విధానం చూసి విశ్వేశ్వరయ్యకి చాలా ముచ్చట కలిగింది. ఆ రచయితనే అలా చూస్తూవున్నారు విశ్వేశ్వరయ్య.

విశ్వేశ్వరయ్య మనసుకి కష్టం కలగగూడదని జాగ్రత్త తీసుకుంటూ, "చూడండి విశ్వేశ్వరయ్యగారూ, ఈ డాలరు తిరిగి ఇచ్చేస్తున్నందుకు నేను మిమ్మల్ని ఏవిధంగానూ కించపరుస్తున్నానని నన్ను అపార్థం చేసుకోకండి. అనుకున్న పారితోషికం కంటె అధికంగా తీసుకోలేను. అది నా సిద్ధాంతం. ఇన్నేళ్ల ఈ సిద్ధాంతాన్ని పాటించటంలోనే నాకు తృప్తి ఉంది. ఇప్పుడు మీ సంతృప్తి కోసం ఈ ఒక్క డాలరుని నేను తీసుకుంటే, ఇన్నేళ్ల నా సిద్ధాంతాన్ని వదులుకున్న అసంతృప్తి జీవితాంతం నాకు నిద్ర పట్టనివ్వకుండా చేస్తుంది. ఆ అపారమైన అశాంతిని నేను భరించలేను. నన్ను క్షమించండి విశ్వేశ్వరయ్యగారు" అన్నాడు రచయిత.

ఈ మాటలతో ఆ రచయిత ఉదాత్తమైన స్వభావాన్ని అర్థం చేసుకున్న విశ్వేశ్వరయ్యగారు, "మీ సిద్ధాం తాన్ని నేను హృదయపూర్వకంగా గౌరవిస్తున్నాను. తెలియక ఆ ఒక్క అదనపు డాలరుతో నేను మీ అమూల్యమైన సమయాన్ని వృధా చేసినందుకు మిమ్మల్ని క్షమాపణ కోరుతున్నాను" అన్నారు విశ్వేశ్వరయ్యగారు.

ఆ అదనపు డాలరు తిరిగి ఇచ్చేయగానే ఆ రచయిత మనసునుండి పెద్ద బరువు దిగి నట్టు అనిపించింది. తేలికబడ్డ మనసుతో ఆయన విశ్వేశ్వరయ్య గారి దగ్గర సెలవు తీసుకొని బయటకి నడిచాడు.

\- సుంకర భాస్కరరావు